క్లుప్తంగా

ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారంపై హర్షం


ప్రొఫెసర్ చెన్నారెడ్డి

టెక్కలి: మండలంలోని కార్గిల్ గూడేం గ్రామానికి చెందిన విశ్రాంత ఉపాధ్యాయుడు జి.వి.రెడ్డి మాస్టారు కుమారుడు ప్రొఫెసర్ గుజ్జు చెన్నారెడ్డికి రాష్ట్రస్థాయి ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారం వరించడంపై గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ చేతుల మీదుగా చెన్నారెడ్డి పురస్కారం అందుకున్నారు. ఆచార్య నాగార్జున విశ్వ విద్యాలయంలో ఆంగ్ల విభాగం అధిపతిగా పనిచేస్తున్న చెన్నారెడ్డికి విశ్వ విద్యాలయాల కేటగిరీలో పురస్కారం దక్కింది. చెన్నారెడ్డి పర్యవేక్షణలో పలువురు 45 పీహెచ్‌డీలు పొందారు. అలాగే ఆయన 216 వ్యాసాలు రాశారు. ఆలిండియా రేడియో, దూరదర్శనలో 50కు పైగా ఉపన్యాసాలు చేశారు.

యువకుల శ్రమదానం


ముళ్లపొదలను తొలగిస్తున్న యువకులు

వజ్రపుకొత్తూరు రూరల్: కొండవూరు గ్రామానికి చెందిన యువకులు ఆదివారం శ్రమదాన కార్యక్రమం చేపట్టారు. కొండవూరు నుంచి చినమురహరిపురం వరకు రోడ్డుకి ఇరువైపులా ఉన్న పిచ్చి మొక్కలు, ముళ్ల పొదలను తొలగించారు. ఈ రోడ్డుపైకి పిచ్చి మొక్కలు వ్యాపించడంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. ఈ మేరకు యువకులు ఆలోచించి శ్రమదానం చేసి పిచ్చి వాటిని తొలగించారు.

ఎమ్మెల్సీ ఆర్థికసాయం


సాయాన్ని అందజేస్తున్న రామారావు

కవిటి: శిలగాం పంచాయతీ గుజ్జుపుట్టుగ గ్రామానికి చెందిన మురపాల దుర్గారావు అనారోగ్యంతో మంచంపట్టాడు. ఈ విషయం తెలుసుకున్న ఎమ్మెల్సీ నర్తు రామారావు ఆదివారం వారి నివాసానికి వెళ్లి బాధితుడ్ని పరామర్శించారు. తనవంతుగా రూ. 20 వేల ఆర్థిక సాయాన్ని అందించారు. కార్యక్రమంలో ఎంపీపీ కడియాల పద్మ, వైఎస్సార్‌సీపీ నాయకులు ప్రకాష్, కొర్రాయి గోపాల్, మేఘనాథం ఉన్నారు.

నారీశక్తిపై అవగాహన


అవగాహన కల్పిస్తున్న ఎస్‌ఐ శ్రీనివాస్

ఇచ్ఛాపురం రూరల్: మహిళల భద్రతపై క్షేత్రస్థాయిలో అవగాహన కల్పించడమే నారీశక్తి కార్యక్రమం ఉద్దేశమని ఇచ్ఛాపురం రూరల్ ఎస్సై ఇ.శ్రీనివాస్ అన్నారు. ఆదివారం కొఠారీలో నారీ శక్తిపై స్థానికులకు అవగాహన కల్పించారు. మహిళల భద్రత, శక్తి యాప్ ఆవశ్యకత, ఉపయోగాన్ని వివరించారు.

చెరువులపై చిన్నచూపు!

- అధికారుల పర్యవేక్షణ కరువు
- పిచ్చిమొక్కలతో దర్శనమిస్తున్న వైనం
- తగ్గుతున్న నీటి నిల్వ సామర్థ్యం
- జోరుగా ఆక్రమణలు


పిచ్చిమొక్కలతో నిండిన సయ్యద్‌ఖాన్ చెరువు

ఇచ్ఛాపురం: నీటితో కళకళలాడాల్సిన చెరువులు పిచ్చిమొక్కలతో దర్శనమిస్తున్నాయి. ఒకప్పుడు చెరువు నీటినే వాడుకునే ప్రజలు ఇప్పుడు దానికి దూరమయ్యారు. చెరువులపై పర్యవేక్షణ లేకపోవడంతో రూపం కోల్పోతున్నాయి. చాలా గ్రామాల్లో ఇదే పరిస్థితి ఉంది. ఒక్క ఇచ్ఛాపురం పురపాలకసంఘం పరిధిలోని ముఖ్యమైన ఐదు చెరువులపై సంబంధిత అధికారుల పర్యవేక్షణ కరువవ్వడంతో నిర్లక్ష్యానికి గురవుతున్నాయి. ఇదే అదునుగా చేసుకొని కూటమి నాయకుల అండతో కబ్జాదారులు ఆక్రమణలకు పాల్పడుతున్నారనే విమర్శలు జోరుగా వస్తున్నాయి. ఇచ్ఛాపురం పట్టణ పరిధిలో సుమారు 11 ఎకరాల విస్తీర్ణం గల సయ్యద్‌ఖాన్ చెరువు గతంలో నిండుకుండలా.. ఎంతో ఆహ్లాదకరంగా ఉండేది. వేసవిలో తలెత్తే మంచినీటి సమస్యను కుళాయిల ద్వారా అధిగమించినప్పటికీ వాడుకకు ఇబ్బందులు తలెత్తేవి. ఆటువంటి పరిస్థితిలో ఆరు వార్డులకు చెందిన ప్రజలకు ఈ చెరువు నీరు ఆసరాగా నిలిచేది. ఇటువంటి చెరువుపై మున్సిపల్ అధికారుల పర్యవేక్షణ కరువవ్వడంతో పిచ్చిమొక్కలు, తుప్పలు పెరిగి అటవీ ప్రాంతాన్ని తలపిస్తోంది. దీంతో చెరువులో నీటి సామర్థ్యం తగ్గుతూ వచ్చింది. ఇదే అదునుగా చేసుకొని చెరువుకి సంబంధించిన స్థలంపై కబ్జాదారుల కన్నుపడింది. ఆ దిశగా ఆక్రమణలు చేసుకొనేందుకు ముందుగా కొంత స్థలాన్ని చదును చేసి అందులో వారి స్వంత ప్రయోజనాలకు వినియోగించుకునేవారు. తరువాత కొద్ది రోజుల్లోనే ఆ స్థలం తనదంటూ ఆక్రమణలకు పాల్పడుతున్నారు. ఇటీవల కాలంలో ఈ పరిస్థితి ఎక్కువగా కనబడుతుంది. అలాగే దాసన్నపేట కూడలి వద్ద సుమారు పదెకరాల విస్తీర్ణంలోని ఎర్రచెరువు గట్టుపై వ్యాపారాలు సాగించేవారంతా గట్టును ఆక్రమిస్తున్నప్పటికీ మున్సిపల్, రెవెన్యూ అధికారులు మాత్రం తమకు పట్టనట్లు వ్యవహరిస్తుండడంతో దాని విస్తీర్ణం పూర్తిగా తగ్గిపోయింది. వీటితో పాటు బెల్లుపడ ఎల్లమ్మ గుడి రోడ్డులోని 30 ఎకరాల విస్తీర్ణం గల కోటేరుబందపై అధికారుల పర్యవేక్షణలేదు. దీంతో సుమారు 200 ఎకరాల పంట భూములకు సాగునీరు కరువైంది. ఈ చెరువులను నమ్ముకొని మత్స్యకారులు చేపల పెంపకం చేసుకొని జీవనం సాగించేవారు. దీనిపై కూడా అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో ఆక్రమణలు పెరిగాయి. మున్సిపల్ సంబంధిత అధికారులు చెరువులపై ప్రత్యేక చొరవచూపి వాటిని అభివృద్ధి చేయాలని స్థానికులు కోరుతున్నారు.

సొంతంగా బాగు చేసుకుంటున్నాం..



చెరువులో పెరిగిపోయిన పిచ్చిమొక్కలను తీయాలని మున్సిపల్ అధికారుల దృష్టికి తీసుకెళ్లినప్పటికీ ఎటువంటి ఫలితం లేదు. దీంతో 7, 8 వార్డులకు చెందిన యువత అంతా కలసి సొంతంగా డబ్బులు వేసుకొని శ్రమదానం చేస్తు సయ్యద్‌ఖాన్ చెరువుని బాగుచేసుకుంటున్నాం. అధికారులు, ప్రజాప్రతినిధులు ప్రత్యేక చొరవతీసుకొని ఈ చెరువుని బాగుచేయాలి.

– బర్ల లక్ష్మణరావు, ఉప్పలవీధి, ఏడో వార్డు, ఇచ్ఛాపురం

అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి



ఇచ్ఛాపురం 23 వార్డులోని సయ్యద్‌ఖాన్ చెరువుపై మున్సిపల్ అధికారుల ప్రత్యేక చొరవ తీసుకొని బాగుచేయాలి. ఇప్పటికే చెరువు అభివృద్ధికి రూ. 10 లక్షలు కేటాయిస్తూ మున్సిపల్ కౌన్సిల్ ఆమోదం తెలిపి ఏడాది పూర్తయిన పనులు మాత్రం ప్రారంభం కాలేదు. ఇప్పటికైన చెరువు అభివృద్ధి పనులు ప్రారంభించాలి.

– గువ్వాడ దిలీప్, 23వ వార్డు కౌన్సిలర్

ఆక్రమణలుంటే తొలగిస్తాం



మున్సిపాలిటీలోని చెరువులను అభివృద్ధి చేసే క్రమంలో ఆక్రమణలుంటే వాటిని నిబంధనలు అనుసరించి తొలగిస్తాం. ఆక్రమణదారులపై చర్యలు తీసుకుంటాం. చెరువుల అభివృద్ధి పనుల కోసం టెండర్లు సిద్ధం చేస్తున్నాం.

– ఎస్.రమేష్, మున్సిపల్ కమిషనర్, ఇచ్ఛాపురం

అపూర్వ కలయిక



కాశీబుగ్గ జెడ్పీ ఉన్నత పాఠశాలలో 1982–83 విద్యా సంవత్సరంలో పదో తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక ఆదివారం జరిగింది. దీనికి చదువుకున్న పాఠశాలే వేదికైంది. సుమారు నాలుగు దశాబ్దాల తరువాత కలుసుకున్న వీరంతా ఒకరినొకరు ఆత్మీయంగా పలకరించుకొని యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. ఆటపాటలతో సందడి చేశారు. గ్రూపుఫొటో తీసుకొని మురిసిపోయారు. తమకు చదువు చెప్పిన గురువులు దాసరధి, బమ్మిడి సుబ్బారావు, సూర్యనారాయణ, ఫ్రాన్సిస్ మాస్టార్లను సత్కరించి గౌరవించారు. చదువుకున్న పాఠశాల అభివృద్ధికి కృషి చేయాలని, ఆపదలో ఉన్న తోటి విద్యార్థులకు అండగా ఉండాలని నిర్ణయించారు. సహచరి విద్యార్థి జామి శ్రీనివాస్‌కు కళానిధి అవార్డు రావడంతో ఆయన్ని సన్మానించారు. ప్రముఖ వ్యాపారి కె.వి. గోపాల్ పర్యవేక్షణలో జరిగిన కార్యక్రమంలో ఎ.సత్యారావు, త్రిపాఠి, సురేష్‌కుమార్, పెంట గణేష్, తాళాసు కాంతారావు, యోగేశ్వరరావు, రోణంకి రమణ, అరుణకుమారి, అనురాధ, ధాత్రి, శైలజ, వసంత పాల్గొన్నారు. – పలాస

విద్యుత్ లైట్లు ఏర్పాటు



టెక్కలి ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి వెళ్లే మార్గంలో ఎట్టకేలకు విద్యుత్ లైట్లను అధికారులు ఏర్పాటు చేశారు. కొద్ది నెలలుగా ఈ మార్గంలో లైట్లు లేకపోవడంతో రాత్రి సమయంలో రోగులు ఆస్పత్రికి వెళ్లేందుకు భయపడుతూ ఉండేవారు. దానిపై పలుమార్లు 'సాక్షి'లో వచ్చిన కథనాలకు స్పందించిన అధికారులు ఎట్టకేలకు లైట్లను ఏర్పాటు చేయడంతో సమస్య పరిష్కారమైంది. – టెక్కలి రూరల్

నగదు పురస్కారాలు ప్రదానం



సంతబొమ్మాళి మండలం పాతమేఘవరం జెడ్పీ ఉన్నత పాఠశాలలో చదివి పదో తరగతి పరీక్షల్లో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు జిల్లా మత్స్యకార సహకార సంఘం డైరెక్టర్ సూరాడ జోగారావు నగదు పురస్కారాలను ఆదివారం అందజేశారు. హెచ్‌ఎం బి.మాధవరావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో 569 మార్కులతో ప్రథమ స్థానం సాధించిన కోడ బిందుకు షీల్డ్‌తో పాటు రూ. మూడు వేలు, 561 మార్కులు సాధించిన డొంక దివ్యకు షీల్డ్, రూ. రెండు వేలు అందజేసి అభినందించారు. హెచ్‌ఎం మాట్లాడుతూ.. జోగారావు ఇదే పాఠశాలలో 15 ఏళ్ల ఉపాధ్యాయులుగా సేవ చేశారని గుర్తుచేశారు. ఉపాధ్యాయులు, ఎం.శివజ్యోతి, జి.తిరుమలరావు, కె.దుర్యోధన, కె.అరవింద, డి.రవి, ఎస్.అప్పారావు, మాధవరెడ్డి, కె.రఘుబాబు, ఎస్.జయలక్ష్మి, జె.దుర్యోధన పాల్గొన్నారు. – సంతబొమ్మాళి

అంగన్‌వాడీలకు కనీస వేతనాలు ఇవ్వాలి


సమావేశంలో మాట్లాడుతున్న ప్రజా సంఘాల నాయకులు

మందస: అంగన్‌వాడీ కార్యకర్తలకు కనీస వేనతం అమలు చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎస్.గణపతి, అంగన్‌వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ నాయకులు జె.హేమలత, పి.ఉమాలక్ష్మి కోరారు. సమస్యల పరిష్కారం కోసం ఐక్యంగా కదాలాలన్నారు. మందసలోని అన్నపూర్ణమ్మ గుడి ఆవరణలో ఆదివారం జరిగిన సమావేశంలో వారు మాట్లాడారు. గత ప్రభుత్వం ఇచ్చిన హామీలు, మినిట్ ప్రకారం అంగన్‌వాడీ కార్యకర్తకు రూ. 26 వేలు, చెల్లించాలని, గ్రాడ్యూటీ అమలు చేయాలని, టీఏ, డీఏ, మెనూ చార్జీలు పెంచాలని కోరారు. ఈ సందర్భంగా నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా జె.హేమలత, కార్యదర్శిగా పి.ఉమాలక్ష్మి, సభ్యులుగా టి.నాగేశ్వరి, సునీత పండా, తులసి, జయమ్మ, స్వాతి, కృష్ణవేణి, నాగమణి, రమాదేవి, రాజేశ్వరి, పుణ్యవతి, త్రివేణి, కోమలి, శ్యామలా కుమారి, మాణిక్యం ఎన్నికయ్యారు.

రైతులతో కలెక్టర్ ముఖాముఖి

- రెండో విడత ఎరువులు అందలేదన్న అన్నదాత


రైతులతో మాట్లాడుతున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

టెక్కలి రూరల్: కోటబొమ్మాళి మండలం తిలారు గ్రామంలోని రైతు సేవా కేంద్రంలో రైతులతో జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఆదివారం ముఖాముఖి నిర్వహించారు. ఈ సందర్భంగా రైతు సేవా కేంద్రం ద్వారా రైతులకు అందుతున్న సేవలు గురించి రైతులను అడిగి తెలుసుకున్నారు. సకాలంలో ఎరువులు అందుతున్నాయా అని కలెక్టర్ రైతులను అడగ్గా.. మొదటి విడత అందాయని రెండో విడత ఇంకా అందలేదని చెప్పారు. త్వరలోనే రెండో విడత ఎరువులు అందుతాయని కలెక్టర్ చెప్పారు. అలానే ఎరువుల వాడకం, దాని వినియోగం పై రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో టెక్కలి ఆర్డీవో కృష్ణమూర్తి, ఏడీఏ జగన్మోహన్‌రావు, తహసీల్దార్ ఆర్.అప్పలరాజు, ఎంపీడీవో ఫణీంద్రకుమార్, ఏవో గోవిందరావు పాల్గొన్నారు.

'పీఎం సూర్య ఘర్'తో వెలుగులు!

- విద్యుత్ బిల్లు ఆదాకు మార్గం
- సబ్సిడీ ఇస్తున్న కేంద్ర ప్రభుత్వం


ఇంటిపై సోలార్ విద్యుత్ ఫలకాలు ఏర్పాటు చేస్తున్న వెండర్స్


వజ్రపుకొత్తూరులో ఓ ఇంటిపై ఏర్పాటు చేసిన సోలార్ విద్యుత్

వజ్రపుకొత్తూరు: ప్రస్తుత ఆధునిక ప్రపంచంలో విద్యుత్ వినియోగం గణనీయంగా పెరుగుతోంది. దీంతో బిల్లులు అధికంగా వస్తున్నాయి. భారీగా వస్తున్న బిల్లులు పేద, మధ్య తరగతి ప్రజలకు భారమవుతున్నాయి. వినియోగం ఇలాగే పెరిగిపోతే భవిష్యత్‌లో విద్యుత్ కొరత తలెత్తే అవకాశం ఉంది. ఆ నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం ప్రత్యామ్నాయంగా పీఎం సూర్యఘర్ పేరిట సోలార్ విద్యుత్‌ను ప్రజల ముందుకు తీసుకు వచ్చింది. ఏపీ విద్యుత్ పంపిణీ సంస్థ ఈ పథకాన్ని అమలు చేస్తోంది. ఇంటి పైకప్పు మీద సోలార్ పలకల ఏర్పాటుకు కేంద్ర ప్రభుత్వం సబ్సిడీ ఇస్తుంది. ముఖ్యంగా ఏసీలు, గ్లీజర్‌లు వాడే వినియోగదారులకు సోలార్ పవర్ ఎంతో ఉపయోగం. ఈ పథకం కోసం బ్యాంక్‌లు సైతం రుణాలు ఇస్తున్నాయి. ట్రాన్స్‌కో అధికారులు గ్రామాల్లో పర్యటిస్తూ సోలార్ ఏర్పాటుకు సుముఖంగా ఉన్న వారి పేర్లు నమోదు చేస్తున్నారు. బిల్లు భారం నుంచి ఉపశమనం పొందేందుకు ప్రజలకు పీఎం సూర్యఘర్ చక్కటి అవకాశం. ఎస్సీ, ఎస్టీ వినియోగదారులకైతే ఈ పథకం ఉచితంగా లభిస్తుంది.

సోలార్‌కు ఏర్పాటు అయ్యే ఖర్చు– సబ్సిడీ వివరాలు ఇలా..			
సామర్థ్యం	ఖర్చు	సబ్సిడీ	నెలకు ఉత్పత్తి యూనిట్‌లు
1 కిలో వాట్	రూ.75 వేలు	రూ.30 వేలు	100
2 కిలో వాట్‌లు	రూ.1.40 లక్షలు	రూ.60 వేలు	220
3 కిలో వాట్‌లు	రూ.2.17 లక్షలు	రూ.78 వేలు	340
4 కిలో వాట్‌లు	రూ.2.67 లక్షలు	రూ.78 వేలు	460

చక్కటి విద్యుత్ ఆదా పథకం



పీఎం సూర్య ఘర్ అనేది చక్కటి విద్యుత్ ఆదా పథకం. సబ్సిడీ నిరంతరం ఇచ్చే ప్రక్రియ కాదు. కొన్ని రోజులు మాత్రమే ఉంటుంది. ఎవరు ముందు తీసుకుంటే వారికే లబ్ధి చేకూరుతుంది. కేంద్రం నిర్దేశిత లక్ష్యం చేరుకుంటే సబ్సిడీ ఎప్పుడైనా ఆగిపోవచ్చు. సోలార్ ఒక్కసారి ఏర్పాటు చేసుకుంటే నిర్వహణ ఖర్చు ఏమీ ఉండదు. 25 ఏళ్లపాటు నిరంతరం సేవలు అందుకోవచ్చు. పలాస డివిజన్ పరిధిలో ఇప్పటి వరకు 120 మంది వరకు సోలార్ సేవలు అందుకుంటున్నారు. ప్రజలందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి.

– జి.వెంకట రమణ, ఏఈ, వజ్రపుకొత్తూరు

సోలార్‌తో ఇవీ ప్రయోజనాలు..

- విద్యుత్‌బిల్లు ఆదా అవుతుంది.
- ఇంటి పైకప్పు చల్లగా ఉంటుంది.
- ఒక్క సారి పెట్టుబడిలో 20 ఏళ్ల వరకు ఇంటికి అవసరమైన విద్యుత్ వినియోగించుకోవచ్చు
- వాడకానికి మించి ఉత్పత్తి చేస్తే మిగులు విద్యుత్ విక్రయంతో ఆదాయం పొందవచ్చు
- మిగులు విద్యుత్‌కు డిస్కంలకు విక్రయంతో పెట్టుబడి సొమ్మును ఐదేళ్లలో పొందవచ్చు
- ఈ పథకం కేవలం గృహ వినియోగదారులకు మాత్రమే వర్తిస్తుంది
- 'పర్యావరణాన్ని కాపాడడంలో భాగస్వాములు కావచ్చు
- 'ఒక కిలో వాట్ సామర్థ్యం కలిగిన సోలార్ రూఫ్‌టాప్ ఏర్పాటు 10 చదరపు మీటర్లు లేదా 100 అడుగుల స్థలం అవసరమవుతుంది.

'అన్నదాత పోరు' విజయవంతం చేయాలి


టెక్కలి:నందిగాం లో అన్నదాత పోరు పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎంపీపీ ఎన్.శ్రీరామ్మూర్తి తదితరులు

టెక్కలి: రైతులు ఎరువుల కోసం ఎదుర్కొంటున్న కష్టాలపై ప్రభుత్వాన్ని నిలదీసేందుకు వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన పిలుపు మేరకు ఈ నెల తొమ్మిదో తేదీన టెక్కలిలో నిర్వహించనున్న 'అన్నదాత పోరు'కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని నందిగాం ఎంపీపీ ఎన్.శ్రీరామ్మూర్తి కోరారు. ఆదివారం నందిగాంలో పార్టీ మండల అధ్యక్షుడు టి.ఫాల్గుణరావు ఆధ్వర్యంలో కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించారు. పార్టీ టెక్కలి నియోజకవర్గ ఇన్‌చార్జి పేరాడ తిలక్ ఆధ్వర్యంలో ఉదయం పది గంటలకు అంబేడ్కర్ జంక్షన్ నుంచి ఆర్డీవో కార్యాలయం వరకు నిర్వహించే ర్యాలీలో నాయకులతో పాటు రైతులు పాల్గొనాలని శ్రీరామ్మూర్తి కోరారు. కార్యక్రమంలో యువజన విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యర్ర చక్రవర్తి, నాయకులు జె.జయరాం, టి.రాజు, ఎ.విష్ణు, ఎస్.బైరాగి, బి.హనుమంతురావు, బి.ప్రభాకరరావు, ఎ.సోమేశ్వరరావు, కె.క్రాంతి, ఎ.అప్పన్న పాల్గొన్నారు.

ర్యాలీకి తరలిరావాలి...

టెక్కలిలో నిర్వహిస్తున్న అన్నదాత పోరు ర్యాలీ కార్యక్రమానికి కోటబొమ్మాళి మండలంలోని పార్టీ నాయకులు, రైతులు తరలిరావాలని మండల పార్టీ అధ్యక్షుడు సంపతిరావు హేమసుందర్‌రాజు కోరారు. కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు.

పోస్టర్ల ఆవిష్కరణ


పలాస: పోస్టర్ల ఆవిష్కరణలో నాయకులు

పలాస: పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ ఒకటో వార్డు మొగిలిపాడు, రెండోవార్డు నెమలినారాయణపురం గ్రామాల్లో వైఎస్సార్‌సీపీ నాయకులు పర్యటించారు. ఈ సందర్భంగా 'అన్నదాత పోరు'పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పార్టీ పలాస– కాశీబుగ్గ మున్సిపాలిటీ పట్టణ కమిటీ అధ్యక్షుడు శిష్టు గోపి మాట్లాడుతూ.. ఈ నెల తొమ్మిదో తేదీ ఉదయం 10 గంటలకు పలాస ఆర్డీవో కార్యాలయం వద్ద ధర్నా మాజీ మంత్రి, పలాస నియోజకవర్గం సమన్వయకర్త డాక్టర్ సీదిరి అప్పలరాజు ఆధ్వర్యంలో జరగనున్న కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఏఎంసీ మాజీ చైర్మన్ పి.వి.సతీష్, పీసీఎంఏ మాజీ అధ్యక్షుడు మల్లా సురేష్‌కుమార్, దున్న సత్యం, నర్తు వెంకటరమణ, బమ్మిడి సంతోష్ కుమార్, అంబటి ఆనందరావు, బిరాటి వల్లభరావు, కింతల శివయ్య మాస్టారు, దున్న చంటి, తామాడ సంతోష్‌కుమార్ పాల్గొన్నారు.

'అన్నదాత పోరు'పై ప్రచారం


వజ్రపుకొత్తూరు రూరల్: అక్కుపల్లిలో పర్యటిస్తున్న నాయకులు

వజ్రపుకొత్తూరు రూరల్: అన్నదాత పోరు కార్యక్రమాన్ని వియవంతం చేయాలని పార్టీ మండల అధ్యక్షుడు తిర్రి రాజారావు, ప్రధాన కార్యదర్శి తమ్మినాన శాంతారావు కోరారు. ఈ మేరకు అక్కుపల్లి, పల్లిసారధి, కిడిసింగి, డోకులపాడు, పెదబాడాం, నగరంపల్లి, చినవంక గ్రామాల్లో ఆదివారం పర్యటించి రైతులతో మాట్లాడి వారి సమస్యలు తెలుసుకున్నారు. పార్టీ నాయకులు ఉప్పరపల్లి ఉదయ్‌కుమార్, సర్పంచ్ హేమలత, హేమంత్, నర్తు ప్రేమ్‌కుమార్, కొర్రాయి గోపి, గణేష్, దేవా, జోగి అప్పారావు, డి.ఉమామహేశ్వరరావు ఉన్నారు.

విజయవంతం చేయాలి


దలి జానకిరెడ్డి

మందస: వె పలాసలో ఈ నెల తొమ్మిదో తేదీన మాజీ మంత్రి సీదిరి అప్పలరాజు ఆధ్వర్యంలో నిర్వహించే 'అన్నదాత పోరు' కార్యక్రమానికి మండలం నుంచి అధికసంఖ్యలో రైతులు, పార్టీ శ్రేణులు హాజరై విజయవంతం చేయాలని మందస మండల వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు దల్లి జానకిరెడ్డి కోరారు. ఈ మేరకు ఆదివారం మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం రైతులకు కావాల్సిన ఎరువులను అందించడంలో విఫలమైందన్నారు.

తరలిరండి


రాంపత్ని చిట్టిబాబు


కవిటి: ఖరీఫ్ వరి సాగు చేస్తున్న రైతుల సమస్యల పరిష్కారమే ధ్యేయంగా ఈ నెల తొమ్మిదో తేదీన చేపట్టనున్న అన్నదాత పోరు కార్యక్రమంలో పెద్ద ఎత్తున పార్టీ నేతలు, కార్యకర్తలు, రైతులు పాల్గొని విజయవంతం చేయాలని వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు రాంపత్ని చిట్టిబాబు కోరారు. ఎరువులు లభ్యంకాక రైతులు ఇబ్బందులు పడుతున్నారన్నారు.

ప్రకృతి వ్యవసాయంతో ప్రయోజనాలు


జిల్లేడు ద్రావణం తయారీపై అవగాహన కల్పిస్తున్న శివానందం

కంచిలి: ప్రకృతి వ్యవసాయ విధానంతో రైతుకు ఎన్నో ప్రయోజనాలున్నాయని మండల యాంకర్ టి.శివానందం అన్నారు. అంపురం యూనిట్ పరిధి కేసరపడ పంచాయతీ జక్కర గ్రామలో ఎర్ర దయానిధికి చెందిన తోటలో జిల్లేడు ద్రావణం తయారీపై రైతులకు ఆదివారం వివరించారు. వంద లీటర్ల జిల్లేడు ద్రావణం తయారీకి కావల్సిన పదార్థాలు తెలియజేసి, దాన్ని తయారు చేసే విధానంపై అవగాహన కల్పించారు. ఈ ద్రావణం వినియోగించడం వలన పొటాష్ లోపం లేకుండా చేస్తుందని, రసం పీల్చు పురుగు నివారణకు ఇది బాగా పనిచేస్తుందని తెలిపారు. పంట ఏపుగా పెరగడానికి కూడా పనిచేస్తుందన్నారు. కార్యక్రమంలో లీడ్ ఫార్మర్ దయానిధి, ఐసీఆర్‌పీ మీనా ఉన్నారు.

• ఏచూరికి ఘనంగా నివాళి


ఏచూరి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న రైతు సంఘ నాయకులు

వజ్రపుకొత్తూరు రూరల్: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న మతతత్వ కార్పొరేటీకరణ విధానాలకు వ్యతిరేకంగా చేసే పోరాటమే సీతారామ ఏచూరికి నిజమైన నివాళి అని రైతు సంఘ నాయకులు కొర్నాన బాలాజీ, తమ్మినాన భాస్కరరావు అన్నారు. మండలంలోని బెండిలో ఆదివారం సీపీఎం అఖిల భారత మాజీ ప్రధాన కార్యదర్శి కామ్రేడ్ సీతారాం ఏచూరి ప్రథమ వర్ధంతి కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతులను ఆదుకోవడంలో పూర్తిగా విఫలమయ్యాయని విమర్శించారు. రైతులకు అవసరమైన ఎరువులు అందించలేకపోయారని, విద్యుత్ సంస్కరణ పేరుతో స్మార్ట్ మీటర్లు పెట్టి కార్పొరేట్ కంపెనీలకు పెంచి పోషించేందుకు లేనిపోని విధానాలను తీసుకువస్తున్నారని మండిపడ్డారు. కార్యక్రమంలో ప్రజా సంఘాల నాయకులు కె.వెంకటరావు, కృష్ణారావు, డి.హరిక్రిష్ణ, గంగమ్మ, కె.సంతోషి ఉన్నారు.